

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే, కొంతమంది కులాల పేరుతో వివాదాలు సృష్టించాలని చూస్తున్నారు. కుల రాజకీయాలతో ప్రజలను విభజించే ప్రయత్నాలు సరికాదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్,** ఎమ్మెల్సీ

బుధవారం 24.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 63 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పెట్టుబడులే ప్రగతి పునాది!

**రూ.34 వేల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం**

**35 వేల ఉద్యోగాలతో యువతకు భారీ ఊరట**

**అమరావతి, ఐటీ, పర్యాటక రంగాలకు కేబినెట్ పెద్దపీట**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సిఫార్సుల మేరకు దాదాపు రూ. 34 వేల కోట్ల పెట్టుబడులకు, సుమారు 35 వేల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సమావేశంలో 80కి పైగా అజెండా అంశాలను పరిశీలించి ఆమోదించారు.

అమరావతి అభివృద్ధిలో భాగంగా ఉండవల్లి ప్రాంతంలో రూ. 426 కోట్లతో మౌలిక వసతుల కల్పన పనులకు ఆమోదం తెలిపారు. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ. 130 కోట్ల పనులకు అనుమతి ఇచ్చారు. అమరావతిలో స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.


విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలకు అనుమతి లభించింది. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపు, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

పరిశ్రమలు, తయారీ రంగంలో సుమారు రూ. 22 వేల కోట్ల పెట్టుబడులకు, ఐటీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో రూ. 5,300 కోట్లకు పైగా పెట్టుబడులకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. ఫుడ్ ప్రాసెసింగ్, పతంజలి, న్యూట్రిఫీడ్స్ రంగాల్లో రూ. 586 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ కొత్త పెట్టుబడులకు మార్గం సుగమమైంది.

పలు సంస్థల ద్వారా రాష్ట్రంలో భారీగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. విశాఖలో ఇన్ఫినిక్స్ ఐటీ క్యాంపస్ ద్వారా సుమారు 4 వేల ఉద్యోగాలు, రాయలసీమలో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ యూనిట్ ద్వారా 3 వేల ఉద్యోగాలు, శ్యామ్ మెటాలిక్స్ స్టీల్ కాంప్లెక్స్ ద్వారా 3,200 మందికి ఉపాధి లభించనుంది.

మిగతా 2లో...





# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్సీ ఆలపాటి

**అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులపై రైతుల ట్రాక్టర్ ర్యాలీ**

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)**: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో ఏడాది తొలి విడత నగదు రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా తెనాలి నియోజకవర్గంలోని సుల్తానాబాద్ మార్కెట్ యార్డులో రైతుల ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు.

మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. సుల్తానాబాద్ మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ ఓవర్ బ్రిడ్జి మీదుగా యడ్ల లింగయ్య పెట్రోల్ బంక్, లక్ష్మీ డీలక్స్ రోడ్, రజక చెరువు, గాంధీ చౌక్ మీదుగా బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ. 13,500 అందిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రూ. 6,000 అందిస్తోందని తెలిపారు. రైతులకు అందించే ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందని పేర్కొన్నారు.

రైతాంగం నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి

మిగతా 2లో...



# 28న పల్స్ పోలియో

**49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ**


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్రానికి ఉన్న పోలియో రహిత హోదాను యదావిధిగా కొనసాగించేందుకు ఈ నెల 28న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్లలోపు వయస్సు కలిగి ఉన్న 49,20,239 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపింది.. రాష్ట్రంలో చివరి పోలియో కేసు 2008లో నమోదైందని, అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ పోలియో రహిత రాష్ట్రంగా కొనసాగుతోందని తెలిపింది. వీటి ఏర్పాట్లను రాష్ట్ర వైద్య ,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఉన్నత స్థాయిలో 'వర్చువల్' గా సమీక్ష జరిపారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు ప్రకటన జారీ చేశారు.

పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న పోలియో కేంద్రాల

మిగతా 2లో...



# వడ్డెరలకు క్వారీల్లో 33 శాతం వాటా కేటాయింపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: యువగళం పాదయాత్రలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వడ్డెర సోదరులు తనను కలిసి వినతిపత్రం సమర్పించారని ఆయన గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వడ్డెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 126 జారీ చేసిందని తెలిపారు.



# కిరాణా కొట్టు నుంచి డేటా సెంటర్ దాకా..
# సింగిల్ పోర్టల్!

- పెట్టుబడులకు వేగం.. అనుమతులకు సరళీకరణ
- 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం సమీక్ష
- ప్రతినెలా భూమిపూజలు, పారంభోత్సవాలు ఉండేలా చర్యలకు ఆదేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం, కిరాణా కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు సింగిల్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేష్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం ఉండవల్లి నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, టీజీ భరత్ (ఆన్ లైన్ ద్వారా) హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చిన 750 భారీ పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయి, ఇవి పూర్తిస్థాయిలో పట్టాలెక్కితే పెద్దఎత్తున రాష్ట్రంలోని

మిగతా 2లో...

# రాయలసీమలో 'పసిడి' పంట

- స్వర్ణగిరిగా... ఇక జొన్నగిరి
- రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి
- ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు-దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత
- ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ
- గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: బంగారు నిక్షేపాల గని అంటే కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి.

మిగతా 2లో...

# గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

- 25న కొత్తగేట్లు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2024లో వచ్చిన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన 19వ గేటు
- నిపుణుల కమిటీ సూచనతో 6 నెలల్లో రూ.51 కోట్లతో 33 కొత్తగేట్ల అమరిక



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వర ప్రదాయిని అయిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పుడు కొత్తగేట్ల అమరికతో సరికొత్త రూపును సంతరించుకుంది. రూ. 51 కోట్ల వ్యయంతో మొత్తం 33 గేట్ల ఏర్పాటు పనులు పూర్తికాగా, వీటిని ఈ నెల 25వ తేదీన కర్నాటక ముఖ్యమంత్రి శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. 73 ఏళ్ల క్రితం నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు రెండు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు

మిగతా 2లో...

# ఆలయాలకు శ్రీవాణి వరం!

- ఆరు దేవాలయాల పునర్నిర్మాణం, అభివృద్ధికి కోట్ల రూపాయల కేటాయింపు
- టీటీడీ కీలక నిర్ణయంపై భక్తుల హర్షం




**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్)**: టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్.. తెలుగు రాష్ట్రాల్లోని ఆధ్యాత్మిక వైభవానికి పెద్దపీట వేస్తోంది.

మిగతా 2లో...

# క్రికెట్ జోష్.. సినీ గ్లామర్!

- ఏపీఎల్-2026 ఆరంభ వేడుకలకు రామ్ చరణ్, థమన్
- మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ఘన ఏర్పాట్లు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)**: మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జీఎంఆర్ ఏపీఎల్-2026 క్రికెట్ టోర్నమెంట్ నేటి నుంచి ఘనంగా ప్రారంభం కానుంది.



2లో

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్సీ ఆలపాటి



(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సకాలంలో అందుబాటులో ఉంచుతోందని తెలిపారు.

రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు రైతులు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలతో పాటు టీడీపీ నాయకులు ఈదర పూర్ణచంద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, భీమవరపు కోటిరెడ్డి, మల్లవరపు విజయ్, రమాదేవి, మధు కోనేరు, యనమల అనిత తదితరులు పాల్గొన్నారు.

## గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

(మొదటి పేజీ తరువాయి)

జీవనాడిగా నిలుస్తోంది. అయితే 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. అప్పటికప్పుడు నీటి వృధాను అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వ చొరవతో, సీఎం చంద్రబాబు సూచనతో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వం వహించి స్టాప్‌లాక్ గేటును అమర్చారు. స్పిల్ వే గేట్లు అన్నీ మార్చాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇవ్వడంతో 6 నెలల్లో కొత్తగేట్లను పూర్తి చేసి ఏపీ–కర్నాటక రాష్ట్రాలు పునరుజ్జీవం పోశాయి.

**ఏపీలో 1.46 లక్షల ఎకరాలకు నీరు :** తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరుతో ఏపీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు కీలకంగా ఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే తుంగభద్ర ప్రాజెక్టు కింద 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. కుడి కాలువ ద్వారా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు నీరందుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు భద్రతను ఏపీ–కర్నాటక రాష్ట్రాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గేట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేశాయి. 25వ తేదీన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని హోస్‌పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

## టూరిస్ట్ బస్సుల పన్ను తగ్గింపుకు కేబినెట్ ఆమోదం



- **రవాణా రంగానికి, బస్సు యజమానులకు భారీ ఊరట**
- **మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) కలిగిన టూరిస్ట్ బస్సులపై త్రైమాసిక పన్ను తగ్గింపు ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో ఈ ప్రతిపాదనను కేబినెట్ పరిశీలించి ఆమోదించింది.

ప్రస్తుతం ప్రతి సీటుకు త్రైమాసికానికి రూ.4 వేలుగా ఉన్న పన్నును రూ.2,500కు తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో టూరిస్ట్ బస్సుల యజమానులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు, ఇతర రాష్ట్రాలకు తరలిన వాహనాల రిజిస్ట్రేషన్లు తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే అవకాశం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర రవాణా రంగ అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, వాహన యజమానుల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గౌతమ్ కిరణ్, ఉపాధ్యక్షుడు కెవీఆర్ నాని, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి సందీప్, జాయింట్ కోశాధికారి సువర్చలాదేవి పాల్గొన్నారు.

# పెట్టుబడులే ప్రగతి పునాది!

(మొదటి పేజీ తరువాయి)



ప్రీమియర్ ఎనర్జీస్ విస్తరణతో 3,040 ఉద్యోగాలు, పతంజలి ఫుడ్ అండ్ హెర్బల్ పార్క్ ద్వారా 2 వేల మందికి ఉపాధి, ఎంసీఎన్ఎక్స్ ఆటోమోటివ్ కెమెరా మాడ్యూల్స్ యూనిట్ ద్వారా 1,633 ఉద్యోగాలు, ఇతర ప్రాజెక్టుల ద్వారా వేలాది అవకాశాలు కలగనున్నాయి.

బీసీ విద్యార్థుల కోసం 10 ఎంజేపీ గురుకులాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎచ్చెర్ల, నక్కపల్లి, మాచర్ల, గిద్దలూరు, గుంతకల్లు, రాయచోటి, పత్తికొండ, మంత్రాలయం, పెనుకొండ, కదిరి ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

అమరావతి ల్యాండ్ పూలింగ్ పథకం కోసం సీఆర్డీఏ పరిధిలో 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిని 15 కిలోమీటర్లకు పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకుంది.

రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటామని సమాచార శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులకు ప్రపంచ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు.

మరోవైపు సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మెమో నెం.57 ప్రకారం 2004కు ముందు నోటిఫికేషన్ పొంది ఉద్యోగాల్లో చేరిన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేసే అంశానికి ఆమోదం లభించింది. కుటుంబ పెన్షన్, గ్రాట్యుటీ అంశాలపై కూడా స్పష్టత ఇచ్చింది.

ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు, ఓపీఎస్ అమలు నిర్ణయాలపై ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

# రాయలసీమలో 'పసిడి' పంట

(మొదటి పేజీ తరువాయి)



దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించునున్నారు. ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వం-కూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

**ప్రారంభోత్సవం... శంకుస్థాపన :** కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్‌తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు :** కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

## కిరాణా కొట్టు నుంచి డేటా సెంటర్ దాకా.. సింగిల్ పోర్టల్!

(మొదటి పేజీ తరువాయి)



యువతకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి, సాధ్యమైనంత త్వరగా ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా పరిశ్రమల శాఖ, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ప్రత్యేకశ్రద్ధ వహించాలని అన్నారు. పనులను వేగవంతంచేసి ప్రతినెలా ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు ఉండేలా అధికారులు చొరవచూపాలని కోరారు.

**పరిశ్రమల ఆకర్షణకు పెద్దఎత్తున రోడ్ షోలకు ప్రణాళికలు :** నవంబర్ లో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ నాటికి సాధ్యమైనంత గరిష్టంగా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సమ్మిట్ కి మించి ఈసారి పెద్దసంఖ్యలో రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించేలా విదేశాలతోపాటు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రోడ్ షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. గత నెలరోజుల వ్యవధిలో 210 భారీ పరిశ్రమలు తర్వాత దశకు చేరుకున్నాయని అధికారులు చెప్పారు. ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ కు సంబంధించిన 26 ప్రాజెక్టుల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి ప్రతి 15రోజులకోసారి కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సమీక్షించాలని మంత్రి లోకేష్ కోరారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పవర్, వాటర్, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రంలో భారీగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వివిధ స్టేజిల్లో ఉన్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ పరిశ్రమలతోపాటు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఎంఎస్ఎంఈలను కూడా ఆన్ బోర్డు చేయాలని అన్నారు. త్వరలో భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో విశాఖపట్నంలో సాధ్యమైనంత ఎక్కువగా హోటల్ గదులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పర్యాటకశాఖ అధికారులకు సూచించారు.

**స్లరీ పైప్ లైన్ పై అధ్యయనం చేయండి:** స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మన ప్రభుత్వ ప్రత్యేకతలు, సులభతరమైన సర్వీస్ డెలివరీ అందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో గార్మెంట్ పరిశ్రమలను ఆకర్షించడానికి చేపట్టాల్సిన చర్యలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై సమావేశంలో చర్చించారు. ఎంప్లాయ్ మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్స్ అందించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టెక్స్ టైల్ పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ ఉత్పత్తి చేసుకునేందుకు ఏడాదిపాటు బ్యాంకింగ్ ఫెసిలిటీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. అనకాపల్లి – విశాఖ – విజయనగరం జిల్లాలు స్టీల్ హబ్ గా ఆవిష్కృతమవుతున్న నేపథ్యంలో కొత్తగా రాష్ట్రానికి వచ్చేందుకు మరికొన్ని ఉక్కు పరిశ్రమలు ఆసక్తిచూపుతున్నాయి, ఇందులో ప్రధానమైన ముడిసరుకు సరఫరా కోసం స్లరీ పైప్ లైన్ కావాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్ మెంట్ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సీఈవో షన్మోహన్, స్కిల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ గణేష్ కుమార్, ఏపీఐఐసీ ఎండీ ఏఎస్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 28న పల్స్ పోలియో



(మొదటి పేజీ తరువాయి)

ద్వారా చిన్నారులకు చుక్కలు వేయనున్నారు. అనంతరం 29, 30 తేదీల్లో ఇంటింటి సందర్శన ద్వారా మిగిలిన చిన్నారులకు చుక్కలు వేయనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 29,873 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వలస కుటుంబాలు, నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, సంచార జాతుల నివాస ప్రాంతాల్లోని చిన్నారులను చేరుకునేందుకు 1,757 ప్రత్యేక బృందాలను నియమించారు. బస్ నిలయాలు, రైల్వే నిలయాలు, విమానాశ్రయాలు, జాతరలు, సంతలు, ప్రధాన రాకపోకల ప్రాంతాల్లో 1,144 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఇంటింటి సందర్శన కోసం 59,746 బృందాలను సిద్దంచేశారు. కార్యక్రమ నిర్వహణకు లక్షా 31 వేల 298 మంది సిబ్బంది పాల్గొననున్నారు.

**కేంద్రం నుంచి వాక్సిన్ రాక.. జిల్లాలకు తరలింపు:** కేంద్ర ప్రభుత్వం నుంచి అందిన 68 లక్షల 67 వేల 740 మోతాదుల పోలియో వాక్సిన్ ఇప్పటికే జిల్లాలకు తరలించారు. వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, పర్యవేక్షకులకు శిక్షణ పూర్తిచేశారు.

సాధారణ టీకా కార్యక్రమంలో పోలియో చుక్కలు తీసుకున్న పిల్లలు కూడా పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని వైద్య, ఆరోగ్యశాఖ కోరింది. పోలియో రహిత ఆంధ్రప్రదేశ్ పరిరక్షణలో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని విజ్ఞప్తి చేసింది.

భారతదేశం పోలియో రహిత దేశంగా కొనసాగుతున్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వ్యాధి పూర్తిగా నిర్మూలన కాలేదు.

## క్రికెట్ జోష్.. సినీ గ్లామర్!

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని వివిధ జట్లు పాల్గొని క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లను అందించనున్నాయి.

మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో తొలిసారిగా జరుగుతున్న ఏపీఎల్–2026 టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆటగాళ్లు, ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

నేడు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఏసీఏ కార్యదర్శి, అమలాపురం ఎంపీ సానా సతీష్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

క్రీడల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, మంగళగిరిలో అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికల ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఏపీఎల్–2026 టోర్నమెంట్ ద్వారా రాష్ట్ర క్రికెట్ ప్రతిభకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఆలయాలకు శ్రీవాణి వరం!

(మొదటి పేజీ తరువాయి)



ఇందులో భాగంగా తాజాగా ఆరు ప్రముఖ దేవాలయాల పునర్నిర్మాణం, సమగ్ర అభివృద్ధికి భారీగా నిధులను మంజూరు చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ ఆలయాల పురోభివృద్ధికి కోట్లాది రూపాయలను కేటాయించి భక్తులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించేందుకు సిద్ధమైంది.

తెలంగాణ ప్రాంతంలోని ఆలయాల విషయానికి వస్తే.. సిద్దిపేట జిల్లా దొమ్మాటలోని శ్రీమహాకాళేశ్వర ఆలయానికి అత్యధికంగా రూ.4.60 కోట్ల భారీ నిధులను కేటాయించింది. ఈ నిధులతో ఆలయ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. అలాగే సంగారెడ్డి జిల్లా కించన్‌పల్లిలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.09 కోట్లు, సికింద్రాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఆధునీకరణ కోసం రూ.50 లక్షలు మంజూరు చేశారు. వీటితో పాటు సిద్దయ్యగుట్ట ధర్మవరంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రూ.50.85 లక్షల నిధులు అందనున్నాయి.

ఈ కేటాయింపుల ద్వారా ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పటిష్టం కానుంది. ఇక ఆంధ్రప్రదేశ్ పరిధిలోని దేవాలయాలకు కూడా శ్రీవాణి ట్రస్ట్ పెద్ద మొత్తంలో నిధులను విడుదల చేసింది. అనకాపల్లి జిల్లా మునగపాకలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల నిమిత్తం రూ.1.75 కోట్లు కేటాయించగా, కర్నూలు జిల్లా హుస్సేనాపురంలోని శ్రీసుంకులమ్మ, మారెమ్మ ఆలయాల అభివృద్ధి పనుల కోసం రూ.1.10 కోట్ల మంజూరు చేశారు. శ్రీవాణి ట్రస్ట్ తీసుకున్న ఈ నిర్ణయంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీల విద్యకు 'కూటమి' దన్ను

- **కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు**
- **ఒక్కో గురుకులంలో 37 పోస్టుల భర్తీకి నిర్ణయం**
- **ఇటీవలే 6 ఎంజేపీలను కళాశాలలుగా అప్ గ్రేడ్**
- **బడి బయట బీసీ బిడ్డలు ఉండకూడదనేదే సీఎం చంద్రబాబు లక్ష్యం**
- **నూతన గురుకులాల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం**
- **బీసీ విద్యకు ప్రాధాన్యమిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యతోనే బీసీలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబునాయుడు భావన. ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బీసీ విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బీసీ బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బీసీ హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది.

**ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్:** ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస(విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి(నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఓనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతలు సైతం ప్రారంభమయ్యాయి.

**కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు :** తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి(అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ,కదిరి(శ్రీసత్యసాయి) లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ గురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరో అయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన ఎంజేపీ గురుకులాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లోని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగనుంది.

**సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు :** బడి బయట ఏ ఒక్కబీసీ బిడ్డా ఉండకూడదనే సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. బీసీల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఈ గురుకులాల ఏర్పాటుతో మరింతమంది పేద బీసీ బిడ్డలు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో ఆహార భద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ బిడ్డలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవలే ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బీసీల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

# మునికూడలికి మహర్దశ

- మోడల్ పుష్కర్ పంచాయత్ అభివృద్ధికి అడుగులు
- పవన్ కళ్యాణ్ చొరవతో దాదాపు రూ. 7 కోట్ల అభివృద్ధి నిధులు
- అధునాతన పుష్కర ఘాట్, రోడ్లు, డ్రైయిన్లు, పారిశుధ్య నిర్వహణ సదుపాయాలతో పర్యాటక శోభ
- మొట్టమొదటి జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీగా మునికూడలి
- పర్యావరణహితంగా 'సప్త రుషి' ఘాట్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'స్వచ్ఛ గోదావరి–పవిత్ర పుష్కరాల' థీమ్ తో మోడల్ పుష్కర పంచాయతీల రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆ దిశగా పని ప్రారంభించారు. సీతానగరం మండల పరిధిలోని మునికూడలి గ్రామంలో మోడల్ పుష్కర్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల సమన్వయంతో దాదాపు రూ. 7 కోట్ల నిధులు మంజూరు చేయించారు. 'సప్త రుషి ఘాట్' ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు మునికూడలి గ్రామ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుధ్య నిర్వహణ, పర్యాటక ఆకర్షణల మేళవింపుతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ మొత్తం నిధులను వినియోగించనున్నారు. దేవాదాయ శాఖ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వ ఆమోదం లభించింది. గోదావరి కాలుష్య నివారణ పనులకు పీసీబీ నిధులు ఖర్చు చేయనున్నారు.

అందులో మునికూడలి సప్త రుషి పుష్కరఘాట్ సమీపంగా ఉన్న ఉమాపార్వతీ సోమేశ్వరస్వామి వారి ఆలయం, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునరుద్ధరణ, మరమ్మతుల నిమిత్తం దేవాదాయ శాఖ రూ. 30 లక్షలు మంజూరు చేసింది. పుష్కరాల సందర్భంగా విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా నాణ్యమైన కరెంటు అందించేందుకు వీలుగా 11కేవీ ఫీడర్ తో పాటు అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, లో టెన్షన్ లైన్ల నిర్మాణం, ఇతర పనుల నిమిత్తం రూ. 1.41 కోట్లు, సప్త రుషి ఘాట్ కి ఇరువైపులా ఉన్న గోదావరి గట్టుపై సిమెంటు రోడ్డు నిర్మాణం, మునికూడలి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ర్యాంపుల నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి రూ. 1.23 కోట్లు వెచ్చించనున్నారు.

మునికూడలి రాష్ట్రంలో మొట్టమొదటి జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీగా అవతరించనుంది. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం మునికూడలి గ్రామం నుంచి విడుదల అయ్యే మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవకుండా గ్రామంలో గ్రామంలో 3.4 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. వాటికి అనుసంధాన రహదారులు, సామాజిక ఇంకుడు గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం, మొక్కలు నాటడం తదితర పనులకు రూ. 68.2 లక్షలు మంజూరయ్యాయి. దీంతోపాటు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ నిధులతో సప్త రుషి ఘాట్ దగ్గర 20 శాశ్వత మరుగు దొడ్ల నిర్మాణం, గ్రామంలో చెత్త సేకరణ నిమిత్తం ఎలక్ట్రికల్ వాహనం ఏర్పాటు చేయనున్నారు. మరో రూ. 10 లక్షలు వెచ్చించి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని నిర్మించనున్నారు. పూర్తి పారిశుధ్యంతో కూడిన వాతావరణం మధ్య పుష్కరాలు నిర్వహించుకునే విధంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు.

గోదావరి కరకట్ట, పుష్కరఘాట్ సమీపంలో రూ. 4 లక్షలతో పొదల తొలగింపు ప్రక్రియ చేపట్టనున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం నిధులతో సప్త రుషి ఘాట్ కి వచ్చే భక్తులకు, మునికూడలి గ్రామ తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 15 లక్షలు, పంచాయతీరాజ్ శాఖ నిధులతో గ్రామం మొత్తం వీధి దీపాలు, ఏర్పాటు చేయనున్నారు. రూ. 1.78 కోట్లతో సప్త రుషి ఘాట్ లో పుష్కరాల నిమిత్తం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తారు. పుష్కరాల సందర్భంగా రాత్రి సమయాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీ ఫోకస్ లైట్లు, సుందరీకరణ దీపాల ఏర్పాటుకు రూ. 20 లక్షలు వెచ్చించనున్నారు. రూ. 15 లక్షలతో రెండు పిండ ప్రదానం షెడ్లు నిర్మించనున్నారు. మర్రిచెట్టు ఆకారంలో ఏర్పాటు చేయనున్న టెర్రకోట డయాస్ పెయింటింగ్, బస్ షెల్టర్ నిర్మాణానికి రూ. 10 లక్షలు, మరో రూ. 5 లక్షలతో పాత పాఠశాల భవనం మరమ్మతులు చేపట్టనున్నారు. వీటితోపాటు పుష్కరాల కోసం తరలివచ్చే భక్తులు సౌకర్యార్థం పార్కింగ్ ప్రదేశాలు, పుష్కరఘాట్, ఆలయాలకు వెళ్లే మార్గాల వివరాలతో కూడిన సైన్ బోర్డులు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ఘాట్ సమీపంలో దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణానికి, జల్లు స్నానం ఏర్పాట్లకు రూ. 25 లక్షలు ఖర్చు చేయనున్నారు. సప్త రుషి పుష్కరఘాట్ కి వచ్చే భక్తులకి పారిశుధ్యం, పచ్చదనం, స్వచ్ఛదనంతో కూడిన మెరుగైన సౌకర్యాలు అందేలా పనులు చేపట్టనున్నట్టు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో మునికూడలి త్వరలో మోడల్ పుష్కర్ పంచాయత్ గా రూపుదిద్దుకోనుంది.

## "సర్" ప్రక్రియలో పాల్గొన్న మంత్రి లోకేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఉండవల్లి లోని తమ నివాసానికి వచ్చిన బూత్ లెవల్ ఆఫీసర్ అడిగిన సమాచారం, డాక్యుమెంట్లను మంత్రి లోకేష్ సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఒక్కరూ ఈ ప్రక్రియలో పాల్గొనాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో పాల్గొనే ప్రజలు ఏదైనా డౌట్లు ఉంటే ఆయా వార్డుల్లో నియమితులైన బీఎల్ఓలను సంప్రదించాలని, ఇందుకోసం సహకరించేందుకు తెలుగుదేశం పార్టీ తరపున బూత్ లెవల్ ఏజంట్లు కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు.

## ఫార్మాసిటీలో భారీ అగ్నిప్రమాదం




**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్) :** ఫార్మాసిటీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి విశాఖ జిల్లాలో గల పరవాడ పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. కార్మికులు తమ విధులు నిర్వహిస్తుండగా తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రాణ భయంతో పరుగులు తీశారు. అయినప్పటికి మంటలు వేగంగా వ్యాప్తి చెందడం, ఊపిరాడకపోవడం తో ఇద్దరు కార్మికులు మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకు ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు. అలాగే ఈ ప్రమాదంలో గాయాలైన క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతులను వేపాడ వెంకటేష్, త్రినాథ్ లుగా అధికారులు గుర్తించారు. కాగా ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉండగా.. పూర్తి వివరాలు అందుబాటులోకి రాలేదు.

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ త్యాగం చిరస్మరణీయం



- బీజేపీ నేతల ఘన నివాళులు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** భారతదేశ సమగ్రత, జాతీయత, ఏకాత్మత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్, జిల్లా అధ్యక్షులు చేరుకూరి తిరుపతిరావు పేర్కొన్నారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా వారు నివాళులు అర్పిస్తూ దేశ సమైక్యత కోసం ఆయన చేసిన సేవలు, త్యాగాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. "ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరాదు" అనే ఆయన సంకల్పం జాతీయ చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆలోచనలు, సిద్ధాంతాల స్ఫూర్తితో భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని పొందుతూ ముందుకు సాగుతోందన్నారు. ఒకప్పుడు బీజేపీకి పరిమిత అవకాశాలు ఉన్న పశ్చిమ బెంగాల్‌లో పార్టీని బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడంలో ఆయన సిద్ధాంతాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

జాతీయవాద భావాలతో దేశ అభివృద్ధికి కృషి చేసిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## 57 మెమో ద్వారా ఓపీఎస్ అమలుపై ఏపీటీఎఫ్ హర్షం

- 11 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులకు ప్రయోజనం: ఏపీటీఎఫ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** 2004కు ముందు నోటిఫికేషన్ పొంది అనంతరం నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికై 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులు, ఏపీపీఎస్సీ ఉద్యోగులు, పోలీసులతో కలిపి రాష్ట్రంలో సుమారు 11 వేల మందికి ఈ నిర్ణయం ప్రయోజనం చేకూరుస్తుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, అనంతరం ఉద్యోగాల్లో చేరిన వారికి మెమో నెం. 57 ద్వారా పాత పెన్షన్ విధానం అమలు చేసిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని ఏపీటీఎఫ్ తరఫున అనేక ప్రాతినిధ్యాలు, పోరాటాలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్ ఆధ్వర్యంలో సభ్య సంఘాలు ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో జూన్ 23న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో అంశాన్ని టేబుల్ ఎజెండాగా తీసుకుని ఓపీఎస్ అమలుకు ఆమోదం తెలపడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయానికి ఏపీటీఎఫ్ తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు

## మంత్రి వర్గ సమావేశంలో నిరాశ

- పీఆర్సీ, ఐఆర్, డీఏలపై నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం: ఎన్. చంద్రశేఖర రెడ్డి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర రెడ్డి అన్నారు.

మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి, వారికి ఇచ్చిన హామీలపై స్పష్టమైన నిర్ణయం వెలువడుతుందని ఉద్యోగ వర్గాలు ఆశగా ఎదురుచూశాయని తెలిపారు. అయితే పీఆర్సీ, ఐఆర్, డీఏలతో పాటు ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం నిరాశ కలిగించిందన్నారు.

రోజురోజుకు పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ శంఖారావం పూరించాలని పిలుపునిచ్చారు. ఐక్య పోరాటంతోనే హక్కులను సాధించుకోగలమని ఎన్. చంద్రశేఖర రెడ్డి తెలిపారు.

### మంత్రి అచ్చెన్నాయుడు కృషితో ఎచ్చెర్లకు

## జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల మంజూరు

- 37 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ ఆమోదం



**నిమ్మాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వెనుకబడిన తరగతుల బాలికలకు నాణ్యమైన గురుకుల విద్య అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన నిరంతర కృషి ఫలించింది. మంత్రి ప్రత్యేక చొరవతో ఎచ్చెర్లకు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాల బాలికలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో గురుకుల విద్యాసంస్థ అవసరాన్ని సమగ్రంగా వివరించి ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించడంలో కీలక పాత్ర పోషించారు.

నూతనంగా మంజూరైన ఈ గురుకుల బాలికల పాఠశాల నిర్వహణ కోసం వివిధ విభాగాల్లో మొత్తం 37 పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన వసతి, శిక్షణా సౌకర్యాలు అందనున్నాయి.

ఎచ్చెర్లకు గురుకుల పాఠశాల మంజూరు కావడం నియోజకవర్గ విద్యా రంగ అభివృద్ధిలో ఒక మైలురాయిగా స్థానిక ప్రజలు అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా బీసీ బాలికలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించే అవకాశం కల్పించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషిని ప్రజలు, బీసీ సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కూడా మంత్రి అచ్చెన్నాయుడు చేసిన కృషిని కొనియాడుతూ, ఎచ్చెర్ల విద్యాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది పేద విద్యార్థినులు గురుకుల విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ఎస్.ఐ.ఆర్ సహాయ కేంద్రం ప్రారంభం




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల జాబితా సంబంధిత సేవలను సులభతరం చేయడానికి ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం మరియు సహాయ సహకారాలు అందించేందుకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు ఎలాంటి అయోమయం లేదా ఆందోళనకు గురికాకుండా ఉండేందుకు ఈ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు పూర్తి సమాచారం అందించడంతో పాటు అవసరమైన దరఖాస్తుల ప్రక్రియలో కూడా సహాయం అందజేయనున్నట్లు చెప్పారు.

ప్రజలు తమ ఓటరు హక్కుకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి సందేహాలు ఉన్నా ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించి సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని, ఈ ప్రక్రియలో ప్రజలకు పూర్తి సహకారం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.

ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై గుంటూరు నగర పాలక సంస్థ హెల్ప్‌లైన్లు



- సందేహాల నివృత్తికి ప్రత్యేక నంబర్లు ఏర్పాటు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి ప్రజల సందేహాలను నివృత్తి చేయడానికి గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది.

ఈ మేరకు నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కె. మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు సందేహాలను పరిష్కరించేందుకు హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలు 0863-2224202, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు 0863-2345106 నంబర్లకు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

హెల్ప్‌లైన్ సేవలు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

## పరవాడ కెమికల్ ఫ్యాక్టరీ అగ్ని ప్రమాదం దురదృష్టకరం



- బాధిత కుటుంబాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సానుభూతి

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ కెమికల్ కర్మాగారంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని పీవీఎన్ మాధవ్ అన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక వాడల్లో తక్షణమే సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా నిబంధనలు అమలు చేయాలని సూచించారు.

అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నట్లు పీవీఎన్ మాధవ్ తెలిపారు.

## 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలుపై ఎన్టీఏ హర్షం




- కేబినెట్ నిర్ణయానికి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** 2003 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఎంపికై 2005లో నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) హర్షం వ్యక్తం చేసింది.

ఈ మేరకు ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ రెండు ప్రధాన సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించిందని ఎన్టీఏ నాయకులు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పలుమార్లు ప్రభుత్వానికి వినతులు అందజేసిందని తెలిపారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## హెవీ డ్రైవింగ్ శిక్షణపై ఆంక్షలు తొలగించాలి

**తాడేపల్లి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా హెవీ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల కార్యకలాపాలపై నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల యజమానులు మంగళవారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పరివాహన్ పోర్టల్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రక్రియ నిలిపివేయడంతో శిక్షణార్థులు లైసెన్సులు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, శిక్షణ కేంద్రాలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని వారు మంత్రికి వివరించారు.

# తమ పిర్యాదును స్వీకరించి న్యాయం చేయండి

జగిత్యాల, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

సోమవారం రోజున జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రాయికల్ మండల కేంద్రానికి చెందినపల్లికొండ గంగయ్య కు 1075 సర్వే నెంబర్ లో 14 గుంటల స్థలం ఉంది.అందులో నుండి 1980 సంవత్సరంలో 7.5 గుంటల భూమి కలిగిరి గంగారెడ్డికి విక్రయించారు.అదే సర్వే నంబర్ లో దొడ్డవసంత్ రెడ్డి 1990 లో ఆర్ఓఆర్ ద్వారా రెండున్నర గంటల భూమి (302.5 గజాల) తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు..

అయితే దొడ్డ వసంత్ రెడ్డి 2013 సంవత్సరంలో 208 గజాల దాసరి ఆనందం కు స్థలం విక్రయించాడు.. మిగిలిన 94.5 గజాల స్థలం నుండి 39 గజాలు 2016 సంవత్సరంలో కాలగిరి గంగారెడ్డికి విక్రయించగా అతనికి 55.5 గజాల స్థలం మాత్రమే మిగిలి ఉంది.అయితే 2016 సంవత్సరంలో కాలగిరి గంగారెడ్డి రాయికల్ తహసిల్దార్ కు దొడ్డ వసంత రెడ్డి తన స్థలాన్ని ఇతరులకు అమ్మడం వలన ఆయన పేరును పహాని నుండి తొలగించాలని లేనియెడల ఆయన ఇతరుల స్థలాన్ని ఆక్రమించే అవకాశం ఉందని లేఖ రాశాడు..కానీ రాయికల్ ఎమ్మార్వో వసంత్ రెడ్డి పేరును పహాని నుండి తొలగించకపోవడం వలనఅదే అదునుగా భావించిన ఆయన 2017లో 293 గజాల స్థలం కట్కం రాజేశం కు విక్రయించారు.అందువల్ల పల్లికొండ గంగయ్య కుమారుడునైన పల్లికొండ భూమయ్య అను నేను ఆ స్థలాన్ని పూర్తిగా నష్టపోతున్నాను.పూర్తిగా విచారణ జరిపి దొడ్డ వసంత్ రెడ్డి పై చర్యలు తీసుకొని నా స్థలాన్ని నాకు దక్కేలా చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు పల్లికొండ భూమయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు..అధికారులు తనకు న్యాయం చేయాలని తను చాలా పేద కుటుంబానికి చెందిన వాడినని ఆయన అభ్యర్థించాడు స్పందించిన అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు.



## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి

# 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించిన రాజేష్

**– దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగంలో పాల్గొన్న గోళ్ళ రాజేష్**

నంద్యాల, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

పట్టణంలోని రోజాకుంటలో ఏర్పాటుచేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం నందు కళ్యాణమండపం అధ్యక్షులు మేడం సుబ్బగురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగం సందర్భంగా భారత దేశ ప్రజలందరూ సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో నిర్వహించిన సుదర్శనయాగం నందు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా దేవస్థాన అధ్యక్షుడు కమిటీ సభ్యులకు గోళ్ళ రాజేష్ ఇచ్చిన మాట ప్రకారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అధ్యక్షులు మేడం సుబ్బ గురుమూర్తి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం రాజేష్ అందించారు .ప్రసన్న వెంకటేశ్వర స్వామి,ఆలయంతో పాటు శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిచేందుకు గోళ్ళ రాజేష్ తనవంతు భాద్యతగా రోజా కుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం తో పాటు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధిలో తన సయంగా ఎల్లప్పుడు తోడ్పాటును అందిస్తానని ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కమిటీ పెద్దలకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మేడం శుబ్బ గురుమూర్తి, ఉపాధ్యక్షులు గొల్ల వెంకటలక్ష్మి, సెక్రటరీలు జీలా



శైలజ, ఇటికాల చంద్రమౌళీశ్వర గుప్తా, అమరేష్,వెంకట సాయి కృష్ణ,వెన్నుపూస సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమం



నంద్యాల, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

నంద్యాల మండలంలోని రాయమల్పురం, పులిమద్ది, భీమవరం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ ఉపసంచాలకులు గంగాధరరావు, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వరి సాగు తగ్గించి పప్పుధాన్యాల సాగు పెంచాలని రైతులకు వివరించారు.

మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను అనుసరించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీని ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న విధానాన్ని రైతులకు వివరించారు.కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, రైతు సేవా సిబ్బంది తేజస్విని, రామునాయక్, లలితతో పాటు రైతులు పాల్గొన్నారు.

# నషా ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ

## -యువతను మత్తు నుంచి కాపాడాలి

సైబరాబాద్, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో మాదకద్రవ్యాల నివారణ అవగాహన పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ సంయుక్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని




పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు తమ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, యువజన సంఘాల సమన్వయంతో డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

# విశాల భారతి హై స్కూల్‌లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం




చౌటుప్పల్ డివిజన్, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం : చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి

చౌటుప్పల్: విశాల భారతి హై స్కూల్‌లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేసుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోగలరని సూచించారు.యోగ గురువు ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ, అష్టాంగ యోగా నియమాలు కేవలం శారీరక వ్యాయామాలు మాత్రమే కాకుండా సంపూర్ణ జీవన విధానమని వివరించారు. మహర్షి పతంజలి అందించిన అష్టాంగ మార్గం మనిషిని శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేర్చుతుందని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, యోగా విద్యార్థులలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్యతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లను కూడా అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు.యోగ గురువు బాలకృష్ణ, యోగా ఇన్‌స్ట్రక్టర్ ఝాన్సీ ఆధ్వర్యంలో విద్యార్థులు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, పలు యోగా ఆసనాలను ప్రదర్శించి యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, బి.ఎడ్. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అందరూ సంకల్పించారు.

# కల్లూరులో గోదాం నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీ పంపిణీ





## దేశ రక్షణకు ఎంపికైన యువకుడికి సన్మానం

నిర్మల్ జిల్లా, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) : కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో నూతన గోదాం నిర్మాణం కోసం సుమారు రూ.30 లక్షల విలువైన ప్రొసీడింగ్ కాపీని ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు మరియు మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం భైంసా మండలంలోని దేగాం గ్రామానికి చెందిన మాగం సంతోష్ దేశ రక్షణ సేనలో ఎంపిక కావడంతో మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. దేశ సేవకు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తూర్పాటి వెంకటేష్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, సర్పంచ్ దశరథ్, మాజీ సర్పంచ్ రమణ గౌడ్, ప్రశాంత్, పురుషోత్తం, మల్లేష్ గౌడ్, అబ్బు మౌలానా, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, చందు రెడ్డి, వార్డు సభ్యులు సుదర్శన్ గౌడ్, నాగేష్, చోటు, ఆనంద్, సాయి, గోవర్ధన్ రెడ్డి, టేకుల లింగన్న, పల్సి దత్తు తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్‌లో మృతి చెందిన వలస కార్మికుడి కుటుంబానికి పరామర్శ



రాయికల్, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

రాయికల్ మండలం వడ్డే లింగాపూర్ గ్రామానికి చెందిన వడ్లురి రాజేందర్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. బోగ శ్రావణి సోమవారం రాజేందర్ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో వడ్డేలింగాపూర్ సర్పంచ్ బండారి మానససాయిరాజ్, రాయికల్ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, నాయకులు రమేష్, వేణు, మహేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, ఎమ్ ఏ ఓ భారతి ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం




తనకల్లు, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

సోమవారం టీ సదుం గ్రామం లో వ్యవసాయ శాక ఆధ్వర్యంలో, టీడీపీ మండలం కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో రైతులకు వ్యవసాయశీ లో ఎంతో ప్రభావం ఉన్నందున తక్కువ నీటితో పండే పంటలు సాగు చెయ్యాలని తెలిపాము. రైతులకి డ్రిప్,స్ప్రింకలర్స్ 90% మరియు ఎస్ సి , ఎస్ టీ వారికి 100% రాయితీ ఇస్తున్నందున ఈ సౌకర్యం ని వినియోగించు కొని పంటలు సాగు చేసుకోవాలని తెలిపాము. యూరియా, డి ఏ పి లో ఏపీ ఏ ఐ ఎమ్ ఎస్ యాప్ ఉపయోగం ని చెప్పాము రైతులందరు మన రైతు మన బలం అనే యూట్యూబ్ ఛానల్ ని చూసి వ్యవసాయం లో వస్తున్నా సూచనలు, సలహాలు పాటించాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎమ్ ఏ ఓ భారతి, మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి ,మల్లికార్జున , పి ఏ సి ఎస్ చైర్మన్ వెంకటరమణ, రైతులు, వి హెచ్ ఏ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

## కార్యకర్త మృతికి నివాళులు అర్పించిన తనకల్లు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి



తనకల్లు, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

తనకల్లు మండలం ఉస్తినిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త చిన్న రెడ్డప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరితో పాటు వైఎస్ఆర్సిపి నాయకులు సత్యసాయి జిల్లా పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ మండ్లిపల్లి మాధవరెడ్డి,ఇందుకూరి విశ్వనాథ్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ రమణ,సూర్య నారాయణ,నాగ భూషణ, సుబ్రమణ్యం తదితరులు నివాళులు అర్పించారు.

# ఉప సర్పంచ్‌ల హక్కులు కాపాడాలి

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం



చౌటుప్పల్ డివిజన్, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :

చౌటుప్పల్ మండల ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు బొమ్మకంటి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల బలోపేతానికి సంబంధించిన పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఇటీవల కొన్ని సోషల్ మీడియా వేదికలు, టెలివిజన్ ఛానళ్లలో ఉప సర్పంచ్‌ల చెక్కు సంతకం (Cheque Power) అధికారాలను రద్దు చేయనున్నట్లు వస్తున్న వార్తలపై ఉప సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉప సర్పంచ్‌లకు ఉన్న హక్కులు, అధికారాలను యథాతథంగా కొనసాగించాలని ఎమ్మెల్యేను కోరారు.అదేవిధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ప్రభుత్వం గౌరవప్రదమైన నెలవారీ వేతనాలు (ఎశీఅశీతీఖతీఅబఎ) మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులుగా సేవలందిస్తున్న వారి ఆర్థిక భద్రత కోసం తగిన గౌరవ వేతనాలు కల్పించాలని కోరారు.ఈ అంశాలపై స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం స్థాయిలో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాలరాజు, మండల ఉపాధ్యక్షులు బాతరాజు ధనుంజయ్, మండల ప్రధాన కార్యదర్శి బోయే సదానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల సురేందర్ రెడ్డి, అలాగే మండలంలోని ఉప సర్పంచ్‌లు ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, గడ్డం సత్తయ్య,ఉప్పునూతల నరసింహ, పెరుమాండ్ల లింగస్వామి, ప్రభాకర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాల కంటే రాజకీయాలూ, కమీషన్‌లు, పదవులే ముఖ్యమా?

- మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**అబ్దుల్లాపూర్‌మెట్ జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని లష్కర్‌గూడ, సుర్మాయి గూడ, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, గుంతపల్లి, గండిచెరువు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకర బ్రిడ్జి కారణంగా స్థానిక ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ బ్రిడ్జి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారడంతో, ప్రజల సమస్యలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కృషితో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అయినప్పటికీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరం. ఈ నేపథ్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజలతో కలిసి లష్కర్‌గూడ బ్రిడ్జి వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యేకు ప్రజల సమస్యల కంటే మంత్రి పదవిపైనే ఎక్కువ ఆసక్తి కనిపిస్తోందని విమర్శించారు. శిలాఫలకాలు మార్చడం కాదనీ పనులు చేసి చూపించాలని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులు తామే తెచ్చినట్టు చూపెట్టుకోవడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ బ్రిడ్జి కొరకు 6.40 కోట్ల నిధుల మంజూరు చేయించి, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా శిలాఫలకం వేసి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ప్రారంభించకపోవడం ప్రజల పట్ల వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసేలోపు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తేనే ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని తెలిపారు. గతంలో ఈ బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంలో కారు నీటిలో మునిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్యాన్ని బీఆర్ఎస్ పార్టీ సహించదని, వారం రోజుల్లోగా పనులు ప్రారంభించకపోతే భారీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# వెంకన్న కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి పొన్నం

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంవీఐ వెంకన్న..
- హనుమకొండలో వెంకన్న పార్థివ దేహానికి నివాళులర్పించిన నేతల..
- కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి పొన్నం, టీపీసీసీ చీఫ్..
- ప్రమాదంపై విచారణకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ నియామకం
- అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్న మంత్రి..



**హనుమకొండ, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** భూపాల పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వెంకన్న పార్థివ దేహానికి హనుమకొండలోని ఆయన నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు నివాళులర్పించారు. అనంతరం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన నేతలు వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, భూపాలపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రవాణా శాఖ అధికారి వెంకన్న మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌ను విచారణ అధికారిగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చిన మంత్రి, ఇది శవ రాజకీయాలు చేసే సందర్భం కాదని స్పష్టం చేశారు. ఘటనపై ప్రభుత్వం అత్యంత గంభీ రంగా వ్యవహరిస్తోందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై అమలు విభాగం చర్యలను మరింత పెంచామని తెలిపారు. అక్రమ రవాణా, ఓవర్‌లోడింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రభుత్వం రాజీ పడదని, ఎలాంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రవాణా శాఖ చెక్‌పోస్టులను తొలగించి ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, అమలు చర్యలను మరింత బలోపేతం చేశామని చెప్పారు. వాహనాల సంఖ్య పెరగడం, మెరుగైన రహదారులు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇటీవల వికారాబాద్‌లో జరిగిన బస్సు ప్రమాదం వంటి ఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఓవర్‌లోడింగ్, అక్రమ రవాణాపై మరింత కఠిన చర్యలు కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణ నియామకం

- జాతీయ సదస్సులో నియామక పత్రం అందజేసిన డాక్టర్ ఉదిత్ రాజ్
- రాజ్యాంగ విలువల వ్యాప్తి, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానన్న రామకృష్ణ



**శ్రీనగర్, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీల సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కెతావత్ రామకృష్ణను నియమించినట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ ఉదిత్ రాజ్ ప్రకటించారు. జమ్మూకాశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సులో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. డాక్టర్ ఉదిత్ రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ జాతీయ సదస్సుకు దేశంలోని 21 రాష్ట్రాల అధ్యక్షులు, ప్రతినిధులు హాజరయ్యారు. వారి సమక్షంలో రామకృష్ణకు నియామక పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సామాజిక, ఆర్థిక, విద్యా అభ్యున్నతి కోసం రామకృష్ణ సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రామకృష్ణ హైదరాబాద్ డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భారత రాజ్యాంగ విలువల ప్రచారం, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉదిత్ రాజ్, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం మరింత అంకితభావంతో కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు రాజ్యాంగ విలువల వ్యాప్తి, సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడతామని రామకృష్ణ పేర్కొన్నారు. ఈ నియామకం తెలంగాణలో సంస్థ కార్యకలాపాలకు మరింత ఊతమివ్వనుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# 2010కు ముందు ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌కు టీయూపీఎస్ వినతి
- తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ



**హైదరాబాద్ జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** 2010 ఆగస్టు 23కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి శాశ్వత మినహాయింపు కల్పించాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జాయింట్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) 2010 ఆగస్టు 23న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)ను ఉపాధ్యాయ అర్హతగా నిర్దేశించిందన్నారు.అయితే ఆ తేదీకి ముందే అప్పటి నిబంధనలు,అర్హతల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో నియమితులైన లక్షలాది మంది ఉపాధ్యాయులకు ప్రస్తుతం టెట్‌ను తప్పనిసరి చేయడం న్యాయబద్ధం కాదని పేర్కొన్నారు. 2026 మే 29న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో దేశవ్యాప్తంగా 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయుల్లో ఆందోళన, అనిశ్చితి నెలకొందన్నారు. దశాబ్దాలుగా విద్యారంగానికి సేవలందిస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సీనియారిటీ తదితర అంశాలపై సందిగ్ధత ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నియామకాలు పొందారని,తర్వాత అమల్లోకి వచ్చిన అర్హత ప్రమాణాలను గతానికి వర్తింపజేయడం సహజ న్యాయ సూత్రాలకు,రాజ్యాంగబద్ధ హక్కులకు విరుద్ధమని తెలిపారు. విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి శాశ్వత మినహాయింపు ఇవ్వాలని, వారి ఉద్యోగ భద్రత, సీనియారిటీ, పదోన్నతులు మరియు ఇతర సర్వీస్ ప్రయోజనాలను పూర్తిగా పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకు రావడం లేదా తగిన సవరణలు చేయడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.అదేవిధంగా దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.లక్షలాది మంది ఉపాధ్యాయులు,వారి కుటుంబాల భవిష్యత్తు ఈ అంశంతో ముడిపడి ఉన్నందున కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రాజ్యసభలో కూడా ప్రస్తావిం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండి భవిష్యత్తును నిర్మించుకోండి

- విద్యార్థులకు మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి పిలుపు..



**మేడ్చల్, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి సూచించారు. సోమవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హితం కళాశాలలో మేడ్చల్ పోలీసుల ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" అంశంపై మెగా అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ శంకర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన నష్టాలు, కుటుంబాలు మరియు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న ఎన్‌డీపీఎస్ (NDPS) చట్టం ప్రకారం డ్రగ్స్ సేవించినా, విక్రయించినా కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు చదువుపై పూర్తి శ్రద్ధ సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా అనుమానాస్పద కదలికలు గమనించినట్లయితే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ విక్రయదారులపై సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.అనంతరం విద్యార్థులందరితో "డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు" అనే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ సీఐ ఎ. సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. సుమారు 400 మందికి పైగా విద్యార్థులు సదస్సుకు హాజరై అవగాహన పొందారు.

# తండ్రిని కోల్పోయిన నిరుపేద కుటుంబానికి చేయూత



**అబ్దుల్లాపూర్ మెట్టు, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ నివాసి, గుండె లింగస్వామి కరోనా సమయంలో మృతి చెందిన విషయం తెలిసిందే, తండ్రిని కోల్పోయిన నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులకు, కుమార్తె అశ్విని, కుమారుడు నిహన్లకు పాఠ్యపుస్తకాలు, విద్యా సంవత్సరం ఫీజు అందచేసిన గ్రామ ఉపసర్పంచ్ అంతటి సుష్మ అశోక్ గౌడ్. అండగా నిలబడి మానవత్వం చాటుకున్న ఉప సర్పంచ్ కి, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి నికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మాచగోని మహేందర్ ముదిరాజ్, దీపిక నాగరాజ్, నారం వెంకట్, ఇబ్రహీం, అప్పి, తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ అధ్యక్షుడికి వరంగల్‌లో ఘన స్వాగతం

- కాంగ్రెస్ ఐక్యతకు ప్రతీకగా నేతల ఆత్మీయ ఆహ్వానం
- మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కారం



**వరంగల్, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన వరంగల్ పర్యటన సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు ఆయనకు ఆత్మీయంగా స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, సంప్రదాయ శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి తమ మద్దతు, గౌరవాన్ని చాటుతూ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నోరు అదుపులో పెట్టుకో..

- క్రిశాంక్ ఓ బచ్చా.. ఫైర్ అయిన కాంగ్రెస్ నేతలు..
- మైనంపల్లిని విమర్శించే స్థాయి క్రిశాంక్ లేదు..



**బోయిన్‌పల్లి, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ,వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ హెచ్చరించారు. మైనంపల్లి హనుమంతరావు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ లపై కృశాంక్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక నోరు పారేసుకుంటున్నారని అన్నారు. రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులను ఎదుర్కొనే దమ్ము లేక వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించబోమని బద్రీనాథ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. తెలుగు రాష్ట్రాలలో నే మైనంపల్లి హనుమంతరావుకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన పట్ల అసభ్యకర రీతిలో మాట్లాడడం సరికాదని మారుతి గౌడ్ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై అసత్య ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని జమీల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు అసత్య ప్రచారాలు మానుకోకపోతే క్రిశాంక్ కు తగిన బుద్ధి చెబుతామని, రాజకీయంలో క్రిశాంక్ బచ్చా అని ఎద్దేవ చేశారు..ఈ సమావేశంలో సదా, బాల్ రాజ్ యాదవ్, నాగేష్, సంతోష్ యాదవ్, వైష్ణవి, ధన లక్ష్మీ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం

- మేడ్చల్‌లో మొహర్రం పీర్ల దర్గా దర్శించిన రాఘవేంద్ర గౌడ్



**మేడ్చల్ జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మొహర్రం పండుగను మేడ్చల్ పట్టణంలో ప్రజలందరూ కలిసి జరుపుకోవడం మత సామరస్యానికి ప్రతీకగా అని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని 297వ డివిజన్‌లో కటిక సాధుల్లా కిషన్ వంశీయులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మొహర్రం (పీర్ల) పండుగ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు రామన్న గారి రాఘవేంద్ర గౌడ్ సోమవారం పీర్ల దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాకు విచ్చేసిన రాఘవేంద్ర గౌడ్‌కు నిర్వాహకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. మొహర్రం పండుగ కులమతాలకు అతీతంగా సోదరభావానికి, గంగా-జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని రాఘవేంద్ర గౌడ్ పేర్కొన్నారు. పీర్ల పండుగను అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా జరుపుకోవడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొడే మహేష్, నాయకులు ప్రమోద్, కటిక వినయ్, శంకర్, రాము, జితేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పీర్లను దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు.

# ధోలేరాపై పెట్టుబడిదారులకు అవగాహన..




**శేర్లింగంపల్లి, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** గుజరాత్‌లో అభివృద్ధి చెందుతున్న ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో పెట్టుబడి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో ఇన్వెస్టర్ మీట్ నిర్వహించారు. నెస్టోరియా ఫార్చ్యూన్ పార్క్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధోలేరా అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతులు, పారిశ్రామిక అవకాశాలపై వివరించారు. ఢిల్లీ-ముంబై పారిశ్రామిక కారిడార్ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ధోలేరా భవిష్యత్ నగరంగా ఎదుగుతోందని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించగా, పెట్టుబడిదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

### కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా

# ప్రజలను సంఘటితం చేయడమే కర్తవ్యం

- ప్రస్తుత సంక్షోభకాలంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం
- ఏఐటీయుసి ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతులు విజయవంతం : ఎమ్మెల్యే



**కొత్తగూడెం జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడమే ఏఐటియుసి కర్తవ్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గౌతంపూర్ కమ్యూనిటీహాల్లో సోమవారం నిర్వహించిన ట్రేడ్‌యూనియన్ శిక్షణ తరగతులు ఘనంగా జరిగాయి. కొత్తగూడెం ఏరియా పరిధిలోని కార్యవర్గసభ్యులు, ఫిట్ కార్యదర్శులు, ఆఫీస్ బేరర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయుసి గౌరవాధ్యక్షులు , ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా పాల్గని ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు, ట్రేడ్ యూనియన్‌ల బాధ్యతలు, కార్మిక హక్కుల పరిరక్షణ అంశాలపై ప్రసంగించారు. శిక్షణ తరగతుల్లో రాష్ట్రఏఐటియుసి నాయకులు సింగు నర్సింహా రావు చారిత్రక భౌతికవాదం, అంశంపై సమగ్రంగా వివరిం చారు. అనంతరం వి.మల్లిఖార్జునరావు, లేబర్‌కోడ్స్‌పై అవగా హన కల్పిస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికులపై పడే ప్రభావాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. అనం తరం సాబీర్‌పాషా, కొరిమిరాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక వర్గం అనే సవాళ్లను ఎదుర్కొంటోందని, ఉద్యోగ భద్రత,వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు,కార్మిక చట్టాల అమలు వంటి అంశాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులుమాట్లాడుతూ కార్మికులసమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడం, అవసరమైతే పోరాటాలు నిర్వహించడమే ట్రేడ్ యూనియన ప్రధాన బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, రమణ మూర్తి, సముద్రాల సుధాకర్, కిష్టోఫర్, గట్టయ్య, సూర్యప్రకాష్, సందబోయిన శ్రీనివాస్, నాగేశ్వరరావు, హుమాయూన్, హీరాలాల్, వీరయ్య, భూక్యా రమేష్, ఏంఆర్‌కె ప్రసాద్, మధుకృష్ణ, కమల్, కిషోర్, చారి, భీమయ్య, అప్పారావు, బందారి మల్లయ్య, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలి

: కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) 2026ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులునిర్వర్తించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఐడిఓసి కార్యాలయం సమావేశమందిరంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎంటీలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఎల్ఎంటీలు, మండల ఆపరేటర్లకు సోమవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్‌మాట్లాడారు. పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు.ఈనెల 25నుండి జూలై 24వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేలో భాగంగా బూత్‌స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందచేసి, అవసరమైన వివరాలను సేకరించి బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తుల ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లారా, మరణించారా, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరు నమోదై ఉన్నారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా సేకరించిన సమాచారమే తుది ఓటరు జాబితా రూపకల్పనకు ప్రామాణికంగా ఉండనున్నందున ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పిఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సూచించారు. బీఎల్ఓ యాప్‌లో వివరాలను సకాలంలో నమోదు చేసి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క అర్హఓటరు కూడా మిగిలి పోకుండా చూడాలన్నారు. శిక్షణలో వివరించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో మాస్టర్‌ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ, ఎన్నికల సూపరింటెంట్ రంగప్రసాద్, ఎస్ఐఆర్‌ప్రక్రియ, ఎన్యూమ రేషన్ ఫారాల నిర్వహణ, బీఎల్ఓ యాప్ వినియోగం, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూ టీ కలెక్టర్ రవీంద్రనాథ్, ఆర్డీఓమధు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎంటీలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఎల్ఎంటిలు, మండల ఆపరేటర్లు, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్‌కి మెమోరాండం అందించిన రమేష్



**కొత్తగూడెం జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతులుఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమేపరిష్కరించాలని కోరుతూ బీజెపి అనుబంధం కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ కలెక్టర్‌కి మెమోరాండం అందించారు. ఈసందర్భంగా కిసాన్‌మోర్చా రాష్ట్రఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇంత వరకు రాష్ట్రప్రభుత్వానికి ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక రూపొందించకపోవడం విచారకరమన్నారు. విత్తనాలు విత్తే నాటి నుండి మార్కెట్లో కొనుగోలు పూర్తయ్యే వరకుప్రతి దశలో ప్రభుత్వంఎలాంటి చర్యలు తీసుకోబోతున్నది స్పష్టమైన వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్‌చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. రైతులు పెట్టుబడి అంతా పెట్టి దిగుబడి రాకపోవడంతో అప్పులపాలై ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంరైతులకు సబ్సిడీ మీద విత్తనాలు అందచేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రూ.2లక్షలుదాటిన బ్యాంకు రుణాలు, రైతులందరికీ కూడా లక్ష వరకు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పంటల భీమా పథకాన్ని అమలు చేయాలని కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్ని వెంటనే అమలు చేయకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, శ్రీనివాసు, రవీందర్, గాయత్రి, రాపాక రమేష్, శ్రీధర్, నవీన్, నరసింహారావు, రామారావు, కుమార్, అజయ్‌కుమార్, మోహన్, కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి

- సివిల్ సప్లైస్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు పంపిన మరవేణి రంజిత్ కుమార్




**రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసిన వరి ధాన్యం కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యమకారుడు మారవేణి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సివిల్ సప్లైస్ శాఖ కమిషనర్‌తో పాటు డైరెక్టర్ జనరల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఎల్లారెడ్డిపేట కిషన్‌దాస్‌పేట్ పోస్టాఫీస్ ద్వారా ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియలో భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ కుంభకోణం కొందరు వ్యక్తులకు మాత్రమే పరిమితం కాదని, గత అనేక సంవత్సరాలుగా ఇదే తరహా అక్రమాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు ఉన్నందున ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరారు. కొంతమంది అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు కుమ్మక్కై రైతుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించారని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యం, మిల్లింగ్‌కు పంపిన ధాన్యం, ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం, ప్రస్తుతం ఉన్న నిల్వలపై పూర్తి వివరాలను సేకరించి ప్రజలకు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిల ఆస్తులపై సమగ్ర విచారణ జరిపి, రికార్డులు, ఆన్‌లైన్ ఎంట్రీలు, నిల్వల లెక్కల్లో ఉన్న వ్యత్యాసాలను గుర్తించి బాధ్యులను నిర్ధారించాలని కోరారు. రైతులకు, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధ్యుల నుంచి రికవరీ చేయడంతో పాటు, విచారణ పూర్తయ్యే వరకు అనుమానిత అధికారులను విధుల నుంచి తప్పించి నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రైతుల చెమటతో పండిన ధాన్యం విషయంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ, సివిల్ సప్లైస్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మరవేణి రంజిత్ కుమార్ కోరారు.

# సేవా స్ఫూర్తితో ముందుకు..

- కరీంనగర్ శాతవాహన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**కరీంనగర్ జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలోని భగత్‌నగర్, రామచంద్రాపూర్ కాలనీలో గల శ్రీ కన్వెన్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన (డిస్ట్రిక్ట్ 320G, రీజియన్-I, జోన్-II) 23వ ప్రతిష్ఠాపన (ఇన్‌స్టాలేషన్) మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2026-27 లయనిస్టిక్ సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. క్లబ్ అధ్యక్షుడిగా లయన్ మహేందర్ మర్రిపెల్లి, ప్రధాన కార్యదర్శిగా లయన్ వేణుగోపాల్ నార్ల, కోశాధికారిగా లయన్ ప్రవీణ్ కుమార్ మెరుగు (సీఏ) బాధ్యతలు స్వీకరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఇన్‌స్టాలేషన్ అధికారిగా పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ హన్మండ్ల రాజిరెడ్డి (పిఎంజెఎఫ్) హాజరై నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. విశిష్ట అతిథిగా పీడీజీ, డిస్ట్రిక్ట్ చీఫ్ అడ్వైజర్ లయన్ కొండ వేణుమూర్తి (పిఎంజెఎఫ్) పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కరీంనగర్ శాతవాహన క్లబ్ గత 22 ఏళ్లుగా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ రంగాల్లో విశేష సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిందని కొనియాడారు. నూతన కార్యవర్గం కూడా అదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నూతన నాయకత్వంలో శాతవాహన లయన్స్ క్లబ్ సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ లయన్ సానా వేణు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ వల్లాల కృష్ణహరి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ లయన్ కొల్లూరి ఆనందం, రీజియన్ చైర్‌పర్సన్ లయన్ బొందిలి సరళ, జోన్ చైర్‌పర్సన్ లయన్ చొటపల్లి సత్య నారాయణ రావు, ప్రోగ్రాం చైర్‌పర్సన్ లయన్ ఎనుగర్తి రమేష్, కో-చైర్‌పర్సన్ లయన్ వి.జగదీశ్వరాచారి, లయన్ తిరుపతి రెడ్డి దాసరి,క్లబ్ సభ్యులు, లయన్స్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## డిడిఆర్‌ఎఫ్ శిక్షణను పర్యవేక్షించిన డీఎస్పీ రవీందర్ రెడ్డి



**కొత్తగూడెం జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు అశ్వాపురం మండలం తుమ్మల చెరువు వద్ద జరుగుతున్న డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిడిఆర్ఎఫ్) శిక్షణ కార్యక్రమాన్ని మణుగూరు డీఎస్పి రవీందర్‌రెడ్డి సోమవారం సందర్శించి పర్యవేక్షించారు.శిక్షణా శిబిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిసిబ్బందికి అందుతున్న శిక్షణ తీరును పర్యవేక్షించారు. విపత్తుల సమయంలో ప్రజలను రక్షించడంలో, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో డిడిఆర్ఎఫ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమన్నారు.శిక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకుఅధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.ఈ పర్యవేక్షణలో సిఐ ఎల్లయ్య,పోలీస్ అధికారులు,డిడిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా

## అందరం కలిసికట్టుగా పోరాడాలి


- యాంటీ డ్రగ్ అవేర్నెస్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ



**భద్రాద్రి కొత్తగూడెం జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరం కలిసికట్టుగా పోరాడాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో యాంటీడ్రగ్ అవేర్నెస్ పోస్టర్లను సోమవారం ఎస్పీ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పోస్టర్లు, బ్యానర్లు, యాంటాడ్రగ్స్ సోల్జర్ సెల్ఫీ పాయింట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 22నుంచి 26వరకు జిల్లాలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో గల పాఠశాలలు, కళాశాలలో, పట్టణాల్లో గ్రామాలలోమాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలపై విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. సమాజంలో మార్పు వచ్చినప్పుడే డ్రగ్స్‌లేని సమాజాన్ని నిర్మించగలమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణా చేసినా వినియోగించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యాధికారులు హాజరుపై

## వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



**కొత్తగూడెం జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది విధి నిర్వహణ, ప్రధాన కార్యాలయహాజరు, సేవలు అందచేతపై సోమవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది విధిగా ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని, విధి సమయాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు ఎటువంటి అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన మాతృమరణ ఘటనల నేపథ్యంలో ప్రతి వైద్యాధికారి మరింత బాధ్యతతో పనిచేయాలని, గర్భిణీల పర్యవేక్షణ, అత్యవసర వైద్యసేవలు, రెఫరల్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ తుకారాం రాథోడ్‌కు ఆదేశించారు. సమయపాలన పాటించని వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ తుకారాంరాథోడ్, జిల్లాప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా



**పాల్వంచ జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. కొత్తగూడెం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బానోతు రవినాయక్ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ధర్నాలోపాల్గన్నవారు పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పాల్వంచలో 2టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి..

- జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించిన ఎస్‌జెకె.అహ్మద్



**పాల్వంచ జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** పాల్వంచ పట్టణంలో 2టౌన్‌పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్‌జెకె.అహ్మద్ సోమవారం ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణంలో రోజు రోజుకు జనాభా పెరుగుతుండటంతో పాటు వివాదాలు, ఆకతాయిల గొడవలు పెరుగుతున్నా యన్నారు. ప్రస్తుతం లక్షకుపైగా జనాభా కలిగిన పాల్వంచ పట్టణంలోనేరాల సంఖ్య పెరుగుతుందని, తరచూ శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం పట్టణానికి ఒకే పోలీస్‌స్టేషన్ ఉండటంతో శాంతిభద్రత పర్యవేక్షణ, కేసుల దర్యాప్తు,ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్‌సిబ్బందిపై పరిపాలనాభారం అధికమవుతుందన్నారు. పాల్వంచలో టూటౌన్ స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన పోలీస్‌సేవలు అందుతాయని విజ్ఞప్తి చేశారు.

### నేరెళ్ల పీహెచ్‌సీని సందర్శించిన

## డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.పవిత్ర



**రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పవిత్ర సందర్శించి, కేంద్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు సంక్షేమ (ఎంసీహెచ్), జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాధి నియంత్రణ చర్యలు తదితర సేవల అమలును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్లు, రికార్డులు, నివేదికలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, అందిస్తున్న సేవల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరిన చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల నుండి వస్తున్న రెవిన్యూ సంస్థలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను ప్రభుత్వ చీఫ్ జీవీ ఆంజనేయులు కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని రెవెన్యూ మంత్రి ఛాంబర్ లో చీఫ్ విప్ జీవి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుండి వస్తున్న రెవిన్యూ సంస్థలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ నిషేధిత జాబితా (22–ూ) నుండి భూములను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ప్రభుత్వం నిషేధిత జాబితా నుండి భూములు తొలగింపులో జాప్యం జరుగుతుందని, దీనివలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే రీ సర్వేలో కొన్ని లోపాలు చోటు చేసుకోవడం వలన భూమి హక్కు దారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. హౌస్ బోల్డ్ సర్వేలో చేర్పులు తొలగింపులకు అనుమతి ఇవ్వాలని, వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల, బొల్లాపల్లి మండల తాసిల్దార్ కార్యాలయాలను నిర్మించాలని చీఫ్ విప్ జీవి విన్నవించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందిస్తూ రెవిన్యూ లో ప్రధానంగా ఉన్న సమస్యలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం నిషేధిత జాబితాలో భూముల తొలగింపు, రీ సర్వే పారదర్శకంగా జరుగుతుందని, జరిగిన చిన్న చిన్న లోపాలను సరిచేస్తున్నామని తెలిపారు. నూజెండ్ల, బొల్లాపల్లి మండల తాసిల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు త్వరలో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

## ఏపీపిటిడి ఆర్టీసీ ఉద్యోగాల సంఘాల జేపసీ ధర్నా



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నందు ఏపీ పిటిడి ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. గుంటూరు జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈపూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీని దశలవారీగా ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని జీవో నెంబర్ 88 రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీలు ఖాళీగా ఉన్న ఉద్యోగుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెనాలి డిపో ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్ష కార్యదర్శులు వి. శంకర్ రావు, నలు కుర్తి సుధాకర్ రావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎన్ సుధాకర్ రావు, కే శ్రీనివాసరావు గారు మరియు మహిళా నాయకులు దానబోయిన లక్ష్మి పార్వతి దేవి, వి ప్రసన్న కుమారి, కె. ఎల్ ప్రభావతి తదితర ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

సాయి నగర్‌కు చెందిన వెనిగళ్ళ లీలా గాయత్రికి రూ. 31,001లు, కొత్తపేటకు చెందిన శెట్టి మణికి రూ. 19,850ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ పేర్కొన్నారు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వాస పద్మావతి, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నందం బాబురావు, సైనాదం శ్రీనివాసరావు, వంగర సదాశివరావు, వంగర హనుమాన్, అనుముల శ్రీనివాసరావు, కొండవీటి రామకోటేశ్వరరావు, అక్కల హరిబాబు, కొరముట్ల రమేష్ బాబు, సలీం బాషా, మాయగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా యత్నం భగ్నం

○ **బొలెరో వాహనాన్ని పట్టించిన టీడీపీ నేతలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందనలు**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలోని నల్లకుంట 8వ లైన్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా యత్నాన్ని టీడీపీ నేతలు అడ్డుకున్నారు. రేషన్ షాప్ నుంచి 100కు పైగా బస్తాల బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బొలెరో వాహనం (AP39 WG 9324)ను గుర్తించి పోలీసులకు అప్పగించారు.

అర్ధరాత్రి సమయంలో అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారాన్ని టీడీపీ ఎస్సీ సెల్ నేత జొన్నకూటి శ్రీను, తండు అమృతరావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, కళ్ళే హరీష్ తదితరులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి అందించారు. ఆమె సూచనలతో అప్రమత్తమైన నేతలు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ తరలింపును అడ్డుకుని ప్రభుత్వ ఆస్తిని కాపాడిన పార్టీ నేతలను అభినందించారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ బియ్యాన్ని అక్రమంగా తరలించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. గతంలో కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణా ఘటనలను గుర్తించిన విషయాన్ని ప్రస్తావించిన ఎమ్మెల్యే, నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయండి

○ **పనుల్లో నాణ్యత పాటించండి**

○ **శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి**

○ **మురుగు ప్రవాహానికి ఆటంకం కలిగించకండి**

○ **13వ వార్డులో పర్యటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసుకునేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక 13వ డివిజన్లో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఉదయం ఎమ్మెల్యే నసీర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికంగా చేపట్టిన డ్రైన్ల నిర్మాణం డ్రైన్లు రోడ్లు, పైపులైన్ల నిర్మాణం శానిటేషన్ అంశాలపై స్థానికులు అడిగి తెలుసుకున్నారు అనంతరం ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించా.రు పనుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించవద్దని సూచించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పనులు మరింత వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పూర్తయిన డ్రెయిన్లపై మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చూడాలని, దీనికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. కాలువలలో ఎలాంటి అడ్డంకులు లేనప్పుడే నీటి ప్రవాహం సక్రమంగా ఉంటుందన్నారు. మురుగు నిలవలు ఎక్కడ కనిపించినా సహించబోమని హెచ్చరించారు. వీధుల్లో శానిటేషన్ పై అశ్రద్ధ వహించవద్దని సూచించారు. కాలువల్లో సిల్ట్ తీత ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**తూర్పులో రెండేళ్ల పాలనపై సభ నేడు**

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రెండేళ్ల కాలంలో చేపట్టినవిజయాలపై నేడు కాకాని రోడ్డులోని ఏఎస్ కన్వెన్షన్ హాల్లో ప్రత్యేక సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలోని వైఫల్యాలను అధిగమిస్తూ ప్రజల ఆశీర్వాదంతో పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్ల కాలంలోనే కనీవినీ ఎరుగని ప్రగతి సాధించిందని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణం, బీసీ వెల్ఫేర్ హాస్టల్, రోడ్లు, కాలువలు, మంచినీటి సరఫరా, ఆట స్థలాల నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. కేవలం అభివృద్ధి కాకుండా ప్రజల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల కాలంలో చేసిన ప్రగతి స్ఫూర్తితో మరో మూడేళ్ళు నియోజకవర్గాన్ని నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

○ **రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు పటిష్ట బందోబస్తు**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నవులూరు గ్రామంలో ఉన్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించారు.

పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, అధికారులు, కోచ్‌లు, వేలాది మంది ప్రేక్షకులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా స్టేడియంలోని ప్రధాన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర ద్వారాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రేక్షకుల గ్యాలరీలు, క్రీడాకారుల డ్రెస్సింగ్ రూములు, వీఐపీ విభాగాలు, కంట్రోల్ పాయింట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, అత్యవసర స్పందన వ్యవస్థలను పరిశీలించారు.

సుమారు ఏడు జట్లు పాల్గొనే ఈ పోటీలను వీక్షించేందుకు దాదాపు 15 వేల మంది ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

స్టేడియం పరిసర ప్రాంతాల్లో యాంటీ సాబోటాజ్ తనిఖీలు, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రేక్షకుల సౌకర్యార్థం ప్రత్యేక పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు, సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

క్రీడా పోటీలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతోందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ అలహారి శ్రీనివాస్, మంగళగిరి రూరల్ సీఐ ఎ.వి. బ్రహ్మం, మంగళగిరి టౌన్ సీఐ వీరాస్వామి, ఇతర పోలీస్ అధికారులు, స్టేడియం యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగ్గురు అదృశ్యమైన బాలురను సురక్షితంగా గుర్తించిన చేబ్రోలు పోలీసులు

○ **ఢిల్లీ నుంచి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగింత**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన ముగ్గురు బాలుర కేసును పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయంతో ఛేదించి వారిని సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

వేజెండ్ల గ్రామానికి చెందిన షేక్ ఆషియా తన కుమారుడు షేక్ జమీర్ అహ్మద్ (13) కనిపించడం లేదని జూన్ 21న చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా జమీర్ అహ్మద్‌తో పాటు సుద్దపల్లి గ్రామానికి చెందిన రాయల భరత్ (12), గుండవరం గ్రామానికి చెందిన తుపాకుల వెంకట గోపి (15) కూడా జూన్ 20 సాయంత్రం నుంచి కనిపించడం లేదని పోలీసులు గుర్తించారు.

ఈ మేరకు చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీల పరిశీలన, సాంకేతిక ఆధారాల సేకరణ, సెల్‌ఫోన్ కాల్ వివరాల విశ్లేషణ, లొకేషన్ ట్రేసింగ్ ద్వారా బాలుర కదలికలను గుర్తించారు.

సాంకేతిక ఆధారాల ద్వారా బాలురు ఢిల్లీకి వెళ్లినట్లు నిర్ధారించిన పోలీసులు అక్కడి అధికారులతో సమన్వయం చేసుకుని వారిని సురక్షితంగా గుర్తించారు. అనంతరం జూన్ 23న బాలురను చేబ్రోలు తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. పిల్లలు ఎక్కడికి వెళు తున్నారు, ఎవరితో తిరుగుతున్నారనే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పిల్లలు కనిపించకుండా పోయిన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

బాలురను సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీస్ అధికారులు అభినందించారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగం దేశానికి స్ఫూర్తి

○ **దేశ సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు**

○ **బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతకర్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ మాట్లాడుతూ దేశ సమైక్యత, అఖండత కోసం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం భారత రాజకీయ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ "ఒకే దేశంలో ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండకూడదు" అనే నినాదంతో ఆయన పోరాడారని తెలిపారు.

దేశ ఏకత్వం కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన బలిదానం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాశ్మీర్ సంపూర్ణ విలీనాన్ని ఆయన ఆకాంక్షించారని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆర్టికల్ 370 రద్దు ద్వారా ఆయన ఆశయాలు నెరవేరాయని తెలిపారు.

దేశభక్తి, సేవాభావం, జాతీయ సమైక్యత పట్ల అంకితభావంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని మధుకర్ జీ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, టీటీడీ పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధులు షేక్ బాజీ, యామిని శర్మ, రవిచంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఓబీసీ మోర్చా నాయకురాలు శివలలిత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు.

## ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి సిద్ధం కావాలి

○ **ఏపీ జేఏసీ అమరావతి కీలక సమావేశంలో తీర్మానాలు**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఏపీ జేఏసీ అమరావతి పిలుపునిచ్చింది. రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేసి ఉద్యోగులను ఉద్యమ కార్యాచరణకు సన్నద్ధం చేయాలని నిర్ణయించింది.

విజయవాడలో ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో అనుబంధ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో జరిగిన సమావేశానికి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, ఆర్థిక డిమాండ్లు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీల మేరకు వెంటనే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ అరియర్స్, పీఆర్సీ అరియర్స్, సేవా సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించని పక్షంలో భవిష్యత్‌లో ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ జేఏసీ నేతలు తెలిపారు. ఈ నెల 25 నుంచి జూలై 10 వరకు అన్ని డివిజన్లలో ఉద్యమ సన్నద్ధత సమావేశాలు నిర్వహించాలని, జూలై 10లోగా అన్ని అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు పూర్తి చేయాలని తీర్మానించారు.

ఉద్యమ సన్నద్ధత సభలను జూలై 12న శ్రీకాకుళంలో, జూలై 21న అనంతపురంలో నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం ఏలూరు, గుంటూరులో కూడా సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఉపాధికి అండగా తోపుడు బండ్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తన క్యాంప్ కార్యాలయంలో పలువురు పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో తోపుడు బండ్లను పంపిణీ చేశారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ సహాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావుపేట 5వ లైన్‌కు చెందిన షేక్ నాజియా, శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ మౌలాలి, కంకరగుంటకు చెందిన పఠాన్ సైదాబీ, ఆర్. అగ్రహారానికి చెందిన పీ. రాములు, వడ్డీగూడెంకు చెందిన మల్లెల కుమారిలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తోపుడు బండ్లను అందజేశారు. గతంలో కూడా అనేక మంది నిరుపేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేసి వారి ఉపాధికి అండగా నిలిచిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ పేద కుటుంబాలు స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తోపుడు బండ్లు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ అభయ రామస్వామి ఆలయానికి నిధుల మంజూరు



○ **ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి ఘన సన్మానం**

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండలం కొత్త బసవాపురం గ్రామంలోని శ్రీ అభయ రామస్వామి ఆలయానికి నిధులు మంజూరు (శాంక్షన్) అయిన సందర్భంగా కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి నీ గ్రామ ప్రతినిధులు, నాయకులు కలిసి పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ఎంపీ అవినాష్ రెడ్డిని గ్రామ ప్రజలు, భక్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, భూమిరెడ్డి బాల సిద్ధారెడ్డి భూమిరెడ్డి శివారెడ్డి, లక్ష్మిరెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న ఎంపీ అవినాష్ రెడ్డి నాయకత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

## ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదు

○ **వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ ఆగ్రహం**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్ఆర్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ ఆరోపించారు.

రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో వేతన సవరణ (పీఆర్సీ), మధ్యంతర భృతి (ఐఆర్), పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) విడుదలపై స్పష్టమైన నిర్ణయం వెలువడుతుందని ఆశించిన లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నిరాశ ఎదురైందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం, గృహ అద్దెలు, రవాణా ఖర్చులు పెరుగుతున్న పరిస్థితుల్లో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ వారి సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పరిపాలనా వ్యవస్థకు వెన్నెముక లాంటి వారని, వారి సేవల ద్వారానే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించడం సమంజసం కాదన్నారు.

వేతన సవరణపై జాప్యం, డీఏ బకాయిల చెల్లింపులో ఆలస్యం, మధ్యంతర భృతి ప్రకటించకపోవడం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు.

వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేయాలని, వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసి స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని, ఇకపై సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా చర్యలు చేపట్టాలని కోరింది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సాయికృష్ణను అడ్డుపెట్టి వైసీపీ వికృత రాజకీయాలు



○ బీజేపీ నేత వల్లూరు జయప్రకాశ్ నారాయణ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కులాల మధ్య విభేదాలు సృష్టించేలా వైసీపీ నాయకత్వం రాజకీయాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ విమర్శించారు. సాయికృష్ణ ఘటనపై బీజేపీ వ్యక్తం చేసిన అభిప్రాయాలను వక్రీకరించి కుల రాజకీయాలకు ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.
గత వైసీపీ పాలనలో బీసీలు, దళితులపై జరిగిన ఘటనలను ప్రజలు మరచిపోలేదని అన్నారు. బాపట్ల యువకుడి హత్య, డాక్టర్ సుధాకర్ ఘటన, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అన్యాయాలు జరిగాయని విమర్శించారు. కాపుల పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.
బీజేపీ రాష్ట్ర ఉపవైస్ ప్రెసిడెంట్ గుడిసె దేవానంద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం సహకరిస్తోందన్నారు.
సాయికృష్ణ మృతి ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తుందని దేవానంద్ తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధారా అంబేద్కర్, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ అమలుకు కేబినెట్ ఆమోదం - ఆర్.జే.యూ.పీ హర్షం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్.జే.యూ.పీ) హర్షం వ్యక్తం చేసింది.
కేంద్ర ప్రభుత్వ మెమో నెం.57 ప్రకారం డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగులలో భరోసా కల్పించిందని ఆర్.జే.యూ.పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరబ్రహ్మం, రాష్ట్ర కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి తెలిపారు.
ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించడం పట్ల ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తీసుకున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ సిద్ధాంతాలు బీజేపీ కార్యకర్తలకు మార్గదర్శకం



○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** దేశ సమగ్రత, జాతీయ ఏకత్వం, ఒకే పరిపాలనా విధానం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు.
డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా విశాఖపట్నంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పీవీఎన్ మాధవ్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అఖండత, సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. దేశంలో ఏకత్వం కోసం "ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండకూడదు" అనే సిద్ధాంతంతో ఆయన పోరాడారని పేర్కొన్నారు.
జాతీయ భావజాలానికి, దేశ సేవకు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం ఆదర్శంగా నిలిచిందన్నారు.
దేశ సమైక్యత, అఖండ భారత సాధన కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కార్యకర్త జాతీయ ప్రయోజనాల కోసం పనిచేయాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని నాయకులు, కార్యకర్తలు సంకల్పం వ్యక్తం చేశారు.
జాతి కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడికి ఘన నివాళులు అర్పించారు.

## డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపుపై కేబినెట్ ఆమోదం

○ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు.
డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు మెమో-57 అమలుకు సంబంధించిన ఫైలుకు కేబినెట్ ఆమోదం తెలపడం ఉపాధ్యాయ లోకానికి ఆనందదాయకమని వారు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సుమారు 11 వేల మంది ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.
డీఎస్సీ-2003 నోటిఫికేషన్ ముందుగా వెలువడినప్పటికీ పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా పెన్షన్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారి దీర్ఘకాల పోరాటానికి న్యాయం చేసినట్లుగా భావిస్తున్నామని తెలిపారు.
ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి మెమో-57 అమలుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ, ఆర్థిక శాఖ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

○ పచ్చిమేత కొరత నివారణకు చర్యలు
○ వర్షాభావాన్ని అధిగమించేందుకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రణాళిక
○ కరపత్రాలను విడుదల చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో పశుసంపద రక్షణ, పశుపోషకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పశువులకు పచ్చిమేత కొరత తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పశుగ్రాసాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా "ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్" విధానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంతో పాటు పశు సంపదపై కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు, పశుపోషకులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను అనుసరించడం ద్వారా మెరుగైన పశుగ్రాస దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చిమేత లభ్యత, పశుగ్రాస నిల్వ, తాగునీటి వసతులు, పశుసంరక్షణ చర్యలపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కరపత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా రైతులు, పశుపోషకులకు ఈ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పశుసంపద పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా పశుపోషకులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.
పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ద్వారా పశుసంపదను సంరక్షించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పశుపోషకులకు అవగాహన కల్పించేందుకు ఈ కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు, శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖ ఫార్మా సిటీ అగ్ని ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు విచారం

○ జిల్లా అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి
○ బాధితులను ఆదుకోవాలని సీఎం ఆదేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా సిటీలోని దక్షిణ్ ఎనర్జీలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికుల మృతిపై సీఎం తన సంతాపం తెలియచేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరుపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫార్మా సిటీ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు, పరవాడ నుంచి మరొక అగ్ని మాపక శకటాలు చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు.

## వైసీపీ కాపు సభ కాదు - రాజకీయ నిరుద్యోగుల ఆర్తనాద సభ



టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** కాకినాడ జిల్లాలో ఇటీవల నిర్వహించిన కాపు సభ కాపుల ఆత్మీయ సమావేశం కాదని, అది రాజకీయ నిరుద్యోగుల ఆర్తనాద సభేనని టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు విమర్శించారు.
రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాపులపై నిజమైన ప్రేమతో కాకుండా రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ నేతలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.
ఎన్నికల ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాపులకు రిజర్వేషన్లు అవసరం లేదని ప్రకటించిన సమయంలో వైసీపీ నేతలు ఎందుకు మౌనం వహించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2014-19 మధ్య నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపులకు కల్పించిన 5 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసినప్పుడు కూడా కాపు నాయకులు స్పందించలేదని అన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా 27 కాపు భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, 80 శాతం పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేసిన సానా సతీష్ బాబు, మిగిలిన పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసినప్పుడు కాపు నాయకులు ఏం చేశారని ప్రశ్నించారు.
వైసీపీకి తెలిసింది కేవలం కుల రాజకీయాలేనని ఆయన ఆరోపించారు. ఎక్కడైనా ఘటన జరిగినా అక్కడికి వెళ్లి రాజకీయాలు చేయడం ఆ పార్టీ నేతల విధానంగా మారిందని విమర్శించారు. ఇటీవల జరిగిన లాకప్ డెత్ ఘటనను కూడా కుల రాజకీయాలకు వాడుకునే ప్రయత్నం చేశారని అన్నారు.
కోనసీమలో ప్రశాంత వాతావరణాన్ని జగన్ ప్రభుత్వం కుల చిచ్చుతో దెబ్బతీసిందని, ఆ సమయంలో 160 మంది కాపు యువకులు అరెస్టయినా వైసీపీ నేతలు స్పందించలేదని విమర్శించారు. ఇప్పుడు అదే నేతలు కాపుల పేరుతో సభలు నిర్వహించడం సరికాదన్నారు.
డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాస్తవాలు మాట్లాడితే వైసీపీ నేతలు ఎందుకు స్పందిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని, కుల రాజకీయాలను ప్రజలు నమ్మరని సానా సతీష్ బాబు పేర్కొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం మరో ముందడుగు

○ 8 వేల మందికి పదవీ పొడిగింపు.. 11 వేల మందికి ఓపీఎస్ ప్రయోజనం
○ అలపర్తి విద్యాసాగర్ పోరాట ఫలితం
○ ప్రభుత్వానికి ఎన్జీజీవో కృతజ్ఞతలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రెండు కీలక నిర్ణయాలపై ఏపీ ఎన్జీజీవో సంఘం గుంటూరు జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాలు ఏపీ ఎన్జీజీవో సంఘ చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తాయని పేర్కొంది.
గుంటూరులోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన ధన్యవాద తీర్మాన సభలో సంఘ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన నిర్ణయాల ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచడం ద్వారా సుమారు 8 వేల మంది ఉద్యోగులకు మరో రెండేళ్లు సేవలందించే అవకాశం కల్పించిందన్నారు.
అలాగే జీఓ నెం.57 ప్రకారం 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫై అయిన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగులకు కొత్త భరోసా కల్పించిందని తెలిపారు. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి ఓపీఎస్ అమలు చేయడం న్యాయమైన హక్కును పునరుద్ధరించినట్లేనని అన్నారు.
గత నాలుగేళ్లుగా పరిష్కారం కాని ఈ రెండు ప్రధాన అంశాలు రాష్ట్ర జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ నాయకత్వంలో జరిగిన నిరంతర పోరాటాలు, ప్రభుత్వంతో చర్చలు, సమన్వయ ప్రయత్నాల ఫలితంగా పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు.
ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించి నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంబంధిత శాఖల అధికారులకు ఏపీ ఎన్జీజీవో సంఘం గుంటూరు జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది.
ఈ సందర్భంగా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభలో ఏపీ ఎన్జీజీవో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు నగర అధ్యక్షులు చింతల కళ్యాణ్ కుమార్, నగర కార్యదర్శి జీ.వీ. కోటేశ్వరరావు, జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం

○ మెమో-57కు కేబినెట్ ఆమోదం - 11 వేల మంది ఉద్యోగులకు న్యాయం
○ ప్రభుత్వ రంగ సంస్థలకు, గురుకుల సొసైటీ పాఠశాలలకు ఓయూ పరిమితి పెంపు
○ కేబినెట్ నిర్ణయాలను హర్షిస్తున్నాం
○ ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ.విద్యాసాగర్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ భద్రత మరియు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం దిశగా తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ఏపీ ఎన్జీజీవో సంఘం హర్షిస్తున్నదని సంఘ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ తెలిపారు.
మెమో-57 ప్రకారం 2004కు ముందు నోటిఫికేషన్ పొందిన పోస్టులపై నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం ఉద్యోగుల దీర్ఘకాలిక పోరాటానికి దక్కిన గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా వేలాది మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడం ఆనందదాయకమని అన్నారు.
ఈ నిర్ణయం ద్వారా సుమారు 11 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు జీవితాంతం భరోసా, సామాజిక భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని తెలిపారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, వివిధ సొసైటీలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచిన నిర్ణయాన్ని కూడా ఆయన స్వాగతించారు. ఇది ఉద్యోగుల సేవలకు గౌరవం కల్పించడమే కాకుండా, వారి అనుభవాన్ని మరింత కాలం రాష్ట్ర అభివృద్ధికి వినియోగించే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు.
మెమో-57 అంశం పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలు మూడు సంవత్సరాలుగా నిరంతర కృషి చేశాయని, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలతో అనేక దఫాల చర్చలు జరిపి సమస్య తీవ్రతను వివరించామని విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన హక్కు సాధన కోసం చేసిన ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.
ఉద్యోగుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు, అలాగే ఈ ప్రక్రియలో సహకరించిన మంత్రివర్గ సహచరులకు, ఉన్నతాధికారులకు ఏపీ ఎన్జీజీవో సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన అన్నారు.
ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపిన సానుకూల దృక్పథం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామని, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఏపీ ఎన్జీజీవో సంఘం నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.
"వ్యక్తుల కోసం కాదు... వ్యవస్థ కోసం పని చేయాలి. అప్పుడు మాత్రమే శాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయి" అనే సిద్ధాంతంతో ఉద్యోగుల ప్రయోజనాల కోసం ముందుకు సాగుతున్నామని విద్యాసాగర్ పేర్కొన్నారు.
మెమో-57 ద్వారా లబ్ధి పొందిన వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాల ఆనందానికి ఈ రోజు ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిపోతుందని ఆయన అన్నారు.

## స్పైసెస్ పార్క్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం

○ ఎగుమతిదారుల సమస్యలపై స్పైసెస్ బోర్డు జాతీయ కార్యదర్శి సమీక్ష



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మిర్చి, పసుపు ఎగుమతుల అభివృద్ధి, రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై స్పైసెస్ బోర్డు జాతీయ కార్యదర్శి మనివనం ఆధ్వర్యంలోని బృందం స్పైసెస్ పార్క్‌లో సమీక్ష నిర్వహించింది.
స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరి వెంకట సుబ్బారావు ఆహ్వానం మేరకు స్పైసెస్ బోర్డు జాతీయ కార్యదర్శి మనివనం, స్పైసెస్ పార్క్ ఇన్‌చార్జి వైజేష్ణ, స్పైసెస్ జోనల్ డిప్యూటీ డైరెక్టర్ అన్నన్, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి భవాని శ్రీ బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా స్పైసెస్ పార్క్‌ను సందర్శించారు.
ఈ సందర్భంగా ఐటీసీ కంపెనీలో మిర్చి, పసుపు ఎగుమతిదారులు, ప్రముఖ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఎగుమతిదారుల కమిటీ సభ్యులు చైనాలో జరుగుతున్న పరిణామాలు, ఎగుమతుల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
ఎగుమతులకు నాణ్యత ప్రమాణాలు అత్యంత కీలకమని, నిషేధిత పెస్టిసైడ్ల వినియోగాన్ని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. తిరస్కరణకు గురైన మిర్చి కంటైనర్ల అంశంపై సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరిపి పరిష్కారానికి కృషి చేస్తామని స్పైసెస్ బోర్డు అధికారులు తెలిపారు.
కొన్ని సందర్భాల్లో మిర్చి ఎగుమతులు తిరస్కరణకు గురవడం సాధారణమేనని, అయితే వాటిని అతిగా ప్రచారం చేయడం వల్ల రైతులు, వ్యాపారులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎగుమతిదారులు కొనుగోలు సమయంలో ల్యాబ్ రిపోర్టులను తప్పనిసరిగా పరిశీలించి నాణ్యతతో కూడిన ఉత్పత్తులను విదేశాలకు పంపితే దేశ ఆదాయం పెరుగుతుందని సూచించారు.
దుగ్గిరాల పసుపు మార్కెట్‌కు గతంలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని కొత్తూరి వెంకట సుబ్బారావు తెలిపారు. పసుపు సాగు చేస్తున్న రైతులు నాణ్యత, దిగుబడి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పాడేరు, సేలం విత్తన శుద్ధి విధానాల ద్వారా పంట నాణ్యత పెంచి మంచి ధరలు పొందే అవకాశం ఉందన్నారు.
వ్యవసాయ శాఖతో సమన్వయంతో చర్యలు తీసుకుంటే రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు వ్యాపారులు, ఎగుమతిదారులు అభివృద్ధి చెందుతారని, తద్వారా జాతీయ ఆదాయం పెరుగుతుందని స్పైసెస్ బోర్డు జాతీయ కార్యదర్శి మనివనం తెలిపారు.
అనంతరం స్పైసెస్ పార్క్‌లోని క్వాలిటీ కంపెనీ, ఐటీసీ, మేన్ కాంకర్ స్పైసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థల ఉత్పత్తులను పరిశీలించారు. స్పైసెస్ పార్క్‌కు రహదారులు, నీరు, విద్యుత్, క్యాంటీన్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎగుమతిదారుల సంఘం కార్యదర్శి తోట రామకృష్ణ, శివారెడ్డి, హేమంత్ కుమార్ జైన్ తదితర వ్యాపారులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467